
సాక్షి
ఒడిశా
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,52,689
బంగారం 148 గ్రాములు
వెండి 92 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



కల్యాణం.. వైభోగం

జయపురం పట్టణంలోని ఎస్‌కే రోడ్డులో ఉన్నటువంటి వైభవ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. - 8లో



అక్రమ మైనింగ్ నిలిపివేయాలి

మల్కన్‌గిరి జిల్లాలోని మత్తిలి సమితి మోహిపోదర్, కమరిపల్లి పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలుపుదల చేయాలని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. - 8లో

న్యూస్‌రీల్

పర్లాకిమిడిలో డీఆర్‌ఎం పర్యటన



పనులను సమీక్షిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్

రాయగడ: గజపతి జిల్లా పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ శనివారం పర్యటించారు. ప్రత్యేక రైలులో ఆయన చేరుకుని స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్లాకిమిడి రైల్వే ప్లాట్‌ఫారం ఎత్తు పెంచడం, ఫుడ్ ప్లాజా వంటి వివిధ పనులను త్వరలో చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఆయనతో పాటు రైల్వే ఇంజనీర్ల సిబ్బంది, ఉద్యోగులు ఉన్నారు.

అక్రమ కలప సీజ్



స్వాధీనం చేసుకున్న కలపతో అధికారులు

బరంపురం: గంజాం జిల్లాలోని దిగబండి అటవీ రేంజ్ పరిధి బ్రమరిపరి పంచాయతీ సమసింగి గ్రామానికి సమీపంలో అక్రమ కలపను అటవీ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీ అధికారి అముల్య కుమార్ ప్రదాన్ ఆదేశాలతో గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో రహస్యంగా నడుస్తున్న మిల్లుపై దాడులు చేశారు. దీనిలో భాగంగా లక్షలు విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నారు.

మొసలి కళేబరం లభ్యం



మరణించిన మొసలితో కొట్ట గ్రామ యువకుడు

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి కొట్ట గ్రామంలో ఒక మొసలి కళేబరం లభ్యమైంది. మొసలి కళేబరాన్ని ఫొటోతీసి ఆ గ్రామంలో కొంతమంది యువకులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో బొయిపరిగుడ, జయపురం అటవీ విభాగ అధికారులు, జయపురం సదర్ పోలీసు అధికారులు గ్రామానికి చేరుకుని ఆ మొసలి తానంతట తాను వచ్చి చనిపోయిందా, లేక ఎవరైనా చంపారా అనే దానిపై దర్యాప్తు ప్రారంభించారు. జయపురం- కొట్ట గ్రామం మార్గంలో పాత్రోపుట్ సమీపంలో ఉన్నటువంటి కొలాబ్ నదిలో అనేక మొసళ్లు ఉన్నాయి. కొలాబ్ నదిలో పలు గ్రామాల ప్రజలు చేపలు పడుతుంటారు. అలా చేపలు పడుతున్న సమయంలో చేపల వలలో ఆ మొసలి పడి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని జయపురం అటవీ అధికారి సచ్చిదానంద పారిడ, జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండిలు వెల్లడించారు.

వంట గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న వంట గ్యాస్ సిలిండర్లు

రాయగడ: సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి ఆదేశానుసారం పౌర సరఫరాల శాఖ సిబ్బంది శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో 46 వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్‌ఎస్‌వో సుకాంశు బోయ్ నేతృత్వంలో జరిగిన దాడుల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్ రెస్టారెంట్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు, వినియోగిస్తున్న 4 డొమస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిలో భాగంగా రెస్టారెంట్ యజమానిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా జిల్లాలోని కొలనార సమితి ముకుంద పూర్‌లో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న మరో 42 డొమస్టిక్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బోయ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం హోటళ్లలో కమర్షియల్ సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. దాడుల్లో రాయగడ సమితి పౌరసరఫరాల శాఖకు చెందిన చైతన్య బెహర, కొలనార సమితికి చెందిన అనిల్ కుమార్ గొమాంగోలు పాల్గొన్నారు.

ప్రజా వైద్యానికి పెద్దపీట

- సీఎం నవీన్ పట్నాయక్
- ఆధునికీకరించిన 73 ఆస్పత్రుల ప్రారంభం



వర్చువల్ విధానంలో ఆమో హాస్పిటల్ కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



రాయగడ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

రాయగడ: రాష్ట్ర ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో అమో హాస్పిటల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఆధునికీకరించిన 73 ఆస్పత్రులను వర్చువల్ విధానంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దీనిలో భాగంగా అత్యాధునిక వైద్య సౌకర్యాలతో కూడిన ఆస్పత్రులను ప్రారంభించామని వెల్లడించారు. వీటితో వైద్య రంగంలో మరో మైలు రాయిని అధిగమించామని పేర్కొన్నారు. ఉత్తమ వైద్య సేవలు అందించే దిశగా మరో 4 వేల మంది వైద్యుల నియామకాలతో పాటు మరో 3 వేలకు పైగా నర్సులను నియమించామని వివరించారు. కార్యక్రమంలో 5టీ చైర్మన్ వీకే పాండ్యన్ పాల్గొన్నారు.

ఐదేళ్లలో 858 ఆస్పత్రులు ఏర్పాటు

రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో మరో 858 కొత్త ఆస్పత్రులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించామని సీఎం నవీన్ తెలియజేశారు. వైద్య రంగంలో రాష్ట్రం మరింత ముందుకు దూసుకుపోయే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలు సైతం మెరుగైన వైద్యసేవలు పొందాలన్న ధృడ సంకల్పంతో అమో హాస్పిటల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య సేవలు పొందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

రాయగడ జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్‌లో సుమారు రూ.4.5 కోట్లతో, అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మరో రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో డయాలిసిస్ సౌకర్యం కూడా ప్రారంభమయ్యింది. రాయగడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మకరంద ముదులి, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, ఏడీఎం భాస్కర రైతా, ఏఎస్పీ విష్ణు ప్రసాద్ పాత్రో, ఏడీఎం పబ్లిక్ హెల్త్ డాక్టర్ వి.లోకనాథ్ రాజు, స్వతంత్ర అభివృద్ధి మండలి అధ్యక్షురాలు అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొన్నారు. గుణుపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మనోజ్ సత్యబాన్ మహాజన్, ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లాలోని మునిగుడ పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, ఏసీసీబీసీ వర్గాల రాష్ట్ర శాఖ సలహాదారుడు పృథ్వీరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మకరంద ముదులి తదితరులు



గుణుపూర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొమాంగో, పక్కనే కలెక్టర్ మహాజన్‌లు



మునిగుడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సరక తదితరులు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరు యువకులు మృతి



మృతదేహాలు వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న యువకుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సత్తిగూడ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు శుక్రవారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా కూకానూర్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సత్తిగూడ జలాశయం చూసేందుకు బైక్‌పై వచ్చారు. అక్కడే పార్కులో సాయంత్రం వరకు గడిపి చీకటిపడిన తర్వాత 8 గంటలకు బయల్దేరారు. అదే సమయంలో సత్తిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అటుగా వస్తున్నారు. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు కింది పడిపోవడంతో సంఘటన స్థలంలోనే ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108 అంబులెన్స్‌లో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులు సత్తిగూడ గ్రామానికి చెందిన బిట్టు బిశ్వస్(20), సుకుమా జిల్లాకు చెందిన సోనధర్ సేట్టియా (19)లుగా వెల్లడించారు. అలాగే మరో ముగ్గురికి గాయాలయ్యారు. శనివారం ఉదయం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో కేసు నమోదు చేశారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రభుత్వ సాయం



పథకం వివరాలు వెల్లడిస్తున్న కార్తికేయన్

భువనేశ్వర్: రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించింది. మిషన్ శక్తి శాఖ ప్రతిపాదన మేరకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించడం విశేషం. మంత్రి మండలి ఆమోదం మేరకు రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మంది లబ్ధి పొందుతారు. తాజా నిర్ణయం ప్రకారం ఎస్‌హెచ్‌జీ కార్యకర్తల యూనిఫాం కోసం ఒక్కొక్కరికీ రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందుతుంది. 1.5 లక్షల ఎస్‌హెచ్‌జీ నాయకులకు బ్లేజర్‌ల కొనుగోలు కోసం ఒక్కొక్కరికీ రూ.2,000 చొప్పున ప్రత్యేక మంజూరుకు కేబినెట్ అంగీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా 1 లక్ష 50 వేల మంది ఎస్‌హెచ్‌జీ నాయకులు పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం దీనికోసం రూ.730 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్ర 5టీ చొరవ కింద మిషన్ శక్తి దేశంలో శక్తివంతమైన మహిళా సాధికారత నమూనాగా మారింది. మిషన్ శక్తి ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని మిషన్ శక్తి శాఖ కార్యదర్శి సుజాత ఆర్.కార్తికేయన్ తెలిపారు.

అభినందనలు



ప్రతిష్టాత్మక సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'గరల్స్ విల్ బి గరల్స్' చిత్రానికి ప్రపంచ చలన చిత్ర డ్రమాటిక్ స్పెషల్ జ్యూరీ అవార్డును అందుకున్న నటి ప్రీతి పాణిగ్రాహిని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె తన నటనా జీవితంలో కొత్త శిఖరాలను అధిరోహించాలని అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

– భువనేశ్వర్

గ్రాడ్యుయేట్లకు స్కాలర్ షిప్ సౌకర్యం

- అమలు చేయడానికి మంత్రి మండలి ఆమోదం



వివరాలు వెల్లడిస్తున్న సీఎస్ ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల విద్యార్థుల కోసం నువా - ఓ స్కాలర్ షిప్ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ పథకం పంచ వర్ష ప్రణాళిక కింద 2023-24 నుంచి 2027-28 వరకు 5 సంవత్సరాల పాటు నిరవధికంగా కొనసాగుతుంది. దీని వ్యయ ప్రణాళిక రూ.3,701.08 కోట్లు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో 10 వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 12 ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర ఎయిడెడ్ కళాశాలలతో సహా ఎయిడెడ్ సంస్కృత కళాశాలలు, ఉన్నత విద్యా శాఖ పరిపాలనా నియంత్రణలో సామ్స్ ద్వారా ప్రవేశం పొందే అన్ ఎయిడెడ్ ప్రైవేట్ కళాశాలలలో ఉన్నత విద్యావకాశాలను సులభతరం చేయడం నువా - ఓ స్కాలర్‌షిప్ పథకం లక్ష్యంగా చీఫ్ సెక్రటరి ప్రదీప్ కుమార్ జెనా పేర్కొన్నారు.

ప్రతి ఏడాది స్కాలర్ షిప్

అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు వార్షిక స్కాలర్‌షిప్ కింద బాలురకు రూ.9,000, బాలికలకు రూ.10,000 మంజూరు చేస్తారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికుల పిల్లల్లో బాలురకు రూ.10,000, బాలికలకు రూ.11,000 చొప్పున వార్షిక స్కాలర్ షిప్ పొందుతారు. కాలియా పథకం కింద వృత్తిపరమైన, సాంకేతిక కోర్సుల కోసం స్కాలర్‌షిప్ లేదా ఆర్థిక సహాయం పొందుతున్న విద్యార్థులకు కొత్త పథకం వర్తించదు. ఆదాయపు పన్ను పరిధిలో ఉన్న వారి పిల్లలు, తల్లిదండ్రులలో ఎవరైనా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు లేదా ప్రత్యక్ష చెల్లింపుగా గ్రాంట్ పొందిన వర్గాలు బ్లాక్ గ్రాంట్ విద్యాసంస్థల విషయంలో ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులు కారని మంత్రి మండలి స్పష్టం చేసింది.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న కొండబాబు

రాయగడ: సదరు సమితి కొత్తపేటలో ప్రథమ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ఇటువంటి తరహా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందని తెలియజేశారు. ఇండోర్, మినీ స్టేడియాల నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఆయా రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మూడు రోజులు పాటుగా జరిగే ఈ టోర్నమెంటులో 18 జట్లు పాల్గొనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌రావు, పిండాపాదొరొ పంచాయతీ సర్పంచ్ మాధవరావు కొండగిరి, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన కేటాయింపు..?

- నబరంగ్‌పూర్ జిల్లాపై బీజేడీ కసరత్తు పూర్తి
- టికెట్లు ఫైనల్ చేసినట్లు సమాచారం
- ఆశావాహుల ముమ్మర ప్రయత్నాలు



రమేష్ చంద్ర మఝి



ప్రదీప్ మఝి



నవీన గోండో



మనోహర్ రంధారితో సదాశివ ప్రధాని

కొరాపుట్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార బీజేడీలో టిక్కెట్లు సంపాదించడం కోసం ఆశావాహులు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. వరుసగా 25 ఏళ్ల అధికారంలో ఉండడంతో మరోసారి కూడా గెలుపు సాధ్యమేనన్న ధీమా ఆ పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. దీంతో టిక్కెట్టు సాధిస్తే చాలు గెలుపు ఖాయమనే ఉద్దేశంతో పార్టీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఒక కుటుంబానికి ఒకే టికెట్టు..?

అయితే రాష్ట్రవ్యాప్తంగా ఒకే కుటుంబం నుంచి అనేక చోట్ల అధిక టిక్కెట్లు ఆశిస్తుండంతో ఒక కుటుంబానికి ఒక్క టికెట్టు నిబంధనను బీజేడీ అధిష్టానం తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. బలంగీర్ వంటి జిల్లాల్లో రాజ వంశీయులు ఎక్కువ స్థానాలు ఆశించడంతో ఈ పరిణామం చోటుచేసుకుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. నబరంగ్‌పూర్ పార్లమెంటరీ స్థానం నుంచి ప్రస్తుతం రమేష్ చంద్ర మఝి కొనసాగుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ స్థానాన్ని ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మఝికి కేటాయించినట్లు తెలుస్తోంది. ప్రదీప్ గతంలో ఇదే స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా కొనసాగారు. ఓటమి అనంతరం బీజేడీలోకి వచ్చారు. టిక్కెట్టు ఇస్తామనే హామీతోనే ప్రదీప్ బీజేడీకి రావడంతో ప్రస్తుతం అతనికే టిక్కెట్టు ఖారారైనట్టు వినికిడి. మరోవైపు రమేష్‌ను జోరిగా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీలో దించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం రమేష్‌కి కేబినెట్ హోదా కల్పిస్తారని అధిష్టానం హామీ ఇచ్చినట్లు కార్యకర్తలు పేర్కొంటున్నారు. అయితే జోరిగాం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రమేష్ తమ్ముడు ప్రకాష్ మఝి ఒకే కుటుంబం నుంచి ఒకరే నిబంధన వలన టిక్కెట్టు కోల్పోయే పరిస్థితి ఉన్నట్లు భోగట్టా. ఇది రమేష్ వర్గీయులకు రుచించడం లేదు. అదేవిధంగా ఉమ్మర్‌కోట్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో సతీమణి నవీనా గోండో బరిలో నిలబడనున్నారు. ఈమె ప్రస్తుతం రాయిఘర్ సమితి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అలాగే డాబుగాం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మనోహర్ రంధారి పేరు దాదాపు ఖాయమైంది. నబరంగ్‌పూర్ విధానసభ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానికి ఖాయం చేసినట్లు తెలుస్తుంది. ఈ విధంగా ప్రస్తుతం జిల్లాలో అధికార పార్టీ టిక్కెట్లు కేటాయింపులు పూర్తయినప్పటికీ, అధికారికంగా ప్రకటించాల్సి ఉందని సర్వత్రా వినిపిస్తున్నాయి. గెలుపు గుర్రాలకే సీఎం నవీన్ పట్నాయక్ ప్రాధాన్యమిస్తున్నారని, దీనికి కేడరంతా సమాయత్తమవ్వాలని సూచిస్తున్నారు.

సైకత శిల్పం సందర్శన

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రముఖ సైకత కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన ఈవీఎం మెషిన్ సైకత శిల్పం ఆకట్టుకుంది ఈ సైకత శిల్పాన్ని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం సందర్శించారు. ఓటు ప్రాముఖ్యతను వివరించిన ఆయనను అభినందించారు.



సుదర్శన్ పట్నాయక్ ఆవిష్కరించిన సైకత శిల్పం

క్లుప్తంగా

అక్రమ మైనింగ్ నిలిపివేయాలి

- లేఖ విడుదల చేసిన మావోయిస్టులు



మావోయిస్టులు విడుదల చేసిన లేఖ

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి మోహి పోదర్, కమరిపల్లి పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌ను వెంటనే నిలుపుదల చేయాలని మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. మల్కన్‌గిరి–కొరాపుట్ బోర్డర్ డివిజన్ కమిటీ కార్యదర్శి రాకేష్ పేరుతో లేఖను శనివారం విడుదల చేశారు. సీఎం నవీన్ పట్నాయక్ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జల్, జంగిల్, జమీన్, హమారా నినాదంతో పోరాడాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల సంపదను దోపిడీ వర్గాలకు దోచి పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో నిక్షిప్తమై ఉన్న ఇనుము, బాక్సైట్, మాంగనీస్, గ్రానైట్, బొగ్గు తదితర విలువైన ఖనిజాలను విదేశీ బహుళ జాతి కంపెనీలకు అప్పగిస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమంగా మైనింగ్ చేపడుతుండడంతో ప్రజలు తాము సంపాదించుకున్న భూమి, ఇళ్లు వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజలు సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



సీతారాముల కల్యాణం జరుపుతున్న దృశ్యం

రాయగడ: స్థానిక హోటల్ స్వాగత్ లైన్‌లో ఉన్నటువంటి శ్రీరామ మందిరం 64వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మందిరం ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు వల్లభాచార్యులు, భాస్కరరాచార్యులు, కె.జగన్నాథాచారి, సాయి శర్మల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో మందిరం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు గుడ్ల గౌరి ప్రసాద్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజమాత సూజ్ఞాని దేవికి నివాళి



రాజమాత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు ప్రతినిధులు

బరంపురం: స్థానిక గిరి మార్కెట్ రోడ్డులోని ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం ఆధ్వర్యంలో దివంగత రాజమాత సూజ్ఞాని దేవి సంతాప సభ శనివారం నిర్వహించారు. ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర తెలుగు సంఘాల ప్రతినిధులు, స్థానిక కళాకారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా సూజ్ఞాని దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆమె తెలుగు ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సమాజం కార్యదర్శి వీవీ రామనారాయణ, రామ్ కుమార్, టి.గోపి, మాజీ ఎమ్మెల్యే శిబసని, మోనింగి కామేశ్వరి, జమ్మల శైలజ, డా.జమ్మల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ధ్యాన ఆరాధనోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్ : క్లోపల్లిలోని సంప్రదాయం కూచిపూడి గురుకులంలో ఆనందో బ్రహ్మ స్పిరిట్యువల్ టాబ్లెట్స్, శ్రీకాకుళం పీఏస్ఎస్ఎం మాస్టర్ల సంయుక్త నిర్వహణలో త్యాగరాజ స్వామి ధ్యాన ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ మాట్లాడుతూ త్యాగరాజు పంచరత్న కీర్తనలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయని తెలిపారు. సురంపల్లి శ్రీనివాస్ శాక్సాఫోన్ వాయిద్య సంగీత ధ్యానం, ఆనందో బ్రహ్మ గ్రూపు త్యాగరాజ కృతులు, రెల్లబాబూరావు త్యాగరాజ కృతులు, శ్రీవాణి సంగీత కళాక్షేత్రం శిష్యబృందం త్యాగరాజ కీర్తనలు, రాజరాజేశ్వరీ సంగీత విద్యాపీఠం శిష్యుల కీర్తనల ఆలాపన ఆకట్టుకున్నాయి.



స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్న వేద పండితులు



సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్యాణం.. వైభోగం

- ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వైభవ వేంకటేశ్వరుడు

పట్టణంలోని ఎన్‌కే రోడ్డులో ఉన్నటువంటి వైభవ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తిరుమల రంగనాథ్ అయ్యంగారి ఆధ్వర్యంలో లక్ష్మీ గోదా సమేత వైభవ వేంకటేశ్వర స్వామివారి కల్యాణం జరిపించారు. దీనిలో భాగంగా స్వామివారికి చక్రస్నానం, తీర్థ ప్రసాద వితరణం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, సంతానం ఆశించేవారికి గరుడ ప్రసాదం, శ్రీపుష్ప యాగం, ఋత్విక్సందానం, మహాదాశీర్వచనం మొదలగు పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం కొట్నాలు దంచారు. రాయగడ వాస్తవ్యులు పణిహారం వేంకట భాస్కరాచార్యుల అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు చేపట్టారు.

– జయపురం



కొట్నాల దంపుడు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణ మహోత్సవానికి దేవ దేవీలను తోడ్కొని వస్తున్న పూజారులు



కల్యాణ మహోత్సవాలను జరుపుతున్న వేద పండితులు

రాయగడలో టికెట్టు రగడ



కపిలాస్ కూడలిలో వెలసిన పూర్ణ చంద్ర మాఝి బ్యానర్



అప్పలస్వామి కద్రక బ్యానర్



లెల్లి మాఝి బ్యానర్

- కాంగ్రెస్ నుంచి పోటీకి ముగ్గురు సమాయత్తం
- పోటాపోటీగా వెలసిన బ్యానర్లు

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో రాయగడలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్, రాయగడ శాసనసభ నియోజకవర్గాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానం ఉంది. దీనిలో భాగంగా రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై పోటీ చేసేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిలిచిన ఈ నియోజకవర్గం నుంచి 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీచేసి మూడో స్థానంలో నిలిచిన అప్పలస్వామి కద్రక మరోసారి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అదేవిధంగా ఇదే స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే పూర్ణ చంద్ర మాఝి (పప్పు), లెల్లి మాఝిలు సైతం ఉవ్విళ్లూరుతున్నారు.

ప్రధాన కూడళ్లలో పోస్టర్లు

కాంగ్రెస్ పార్టీ నుంచి తాను పోటీ చేస్తానని అందుకు అందరి ఆశీస్సులు అవసరమని ఇప్పటికే పార్టీ టిక్కెట్టు ఆశిస్తున్న అప్పలస్వామి కద్రక, పప్పు మాఝి, లెల్లి మాఝిలు తమ తమ ఫోటోలతో పట్టణ ప్రధాన కూడళ్లలో బ్యానర్లను ఏర్పాటు చేశారు. అయితే అధిష్టానం ఎవరికి టిక్కెట్టు కేటాయిస్తే వారి గెలుపునకు తామంతా కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో స్పష్టం చేశారు.

జెమ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అవార్డు



ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చీఫ్ మినిస్టర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్‌కేర్ సర్వీస్ అవార్డు ఈ నెల 13న ఒడిశా ప్రభుత్వం అందజేసిందని ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోని 22 ఆస్పత్రులు ఈ అవార్డు గెలుచుకోగా, మన రాష్ట్రం నుంచి జెమ్స్ మాత్రమే చోటు సాధించిందని పేర్కొన్నారు. రోగులకు భద్రత, వారికి అందిస్తున్న సౌకర్యాల కల్పనతో పాటు ఒడిశా ప్రభుత్వం అందిస్తున్న బీఎస్‌కేవై పథకం ద్వారా రోగులకు మెరుగైన ఉచిత సేవలు అందించినందుకు గాను ఈ అవార్డును ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా తీసుకున్నట్లు జెమ్స్ సీఈఓ బొల్లినేని ఆద్విక్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డుతో జెమ్స్‌పై బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాలకు వచ్చిన రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వారికి ఆరోగ్యశ్రీ, బీఎస్‌కేవై తదితర పథకాల ద్వారా వ్యాధి నయం చేసేందుకు ఆస్పత్రి సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అవార్డును అందుకున్న వారిలో సీఏఓ ఎస్.రామ్మోహన్, డైరెక్టర్లు డాక్టర్ సుధీర్, ఆర్ఎంఓలు డాక్టర్ బాలమురళీ, ప్రవీణ్, ఆపరేషన్ మేనేజర్ జోత్స్న, పాల్గొన్నారు.

పని నేర్పి.. కొలువు చూపి

- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ట్రేడ్‌తో పాటు కంప్యూటర్‌పై అవగాహన
- శిక్షణ అనంతరం మెరుగైన ఉపాధి



సూయింగ్ మిషన్ ఆపరేటర్ ట్రేడ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో జాబ్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు మెరుగైన పద్ధతుల్లో ఉపాధి శిక్షణ అందజేస్తున్నారు. ఇదివరకూ ఏ ట్రేడ్‌లో జాయిన్ అయితే ఆ ట్రేడ్‌కు సంబంధించిన శిక్షణ మాత్రమే అందించేవారు. ఇప్పుడు ట్రేడ్‌తో పాటు పలు నైపుణ్య శిక్షణలను కూడా అందిస్తున్నారు. ఎచ్చెర్ల సమీపంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రంలో స్కిల్ కళాశాలలో నిరుద్యోగ యువతకు రెండు రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. సీడాప్ ఆధ్వర్యంలో సూయింగ్ మిషన్ ఆపరేటర్ (ఎంఎస్‌ఓ), పేషెంట్ రిలేషన్ అసోసియేట్ రంగాల్లో ఉపాధి శిక్షణలు అందిస్తున్నారు. సూయింగ్ మిషన్ ఆపరేటర్ రంగంలో మహిళలకు కుట్టుశిక్షణతో పాటు కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లిష్ భాషపై పట్టు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం టెక్స్‌టైల్స్ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే పేషెంట్ రిలేషన్ అసోసియేట్ శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యత, వైద్యరంగంలో నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. ఈ రెండు రంగాలకు డిమాండ్ ఉండటంతో శిక్షణ పూర్తి చేసిన వెంటనే ఉపాధి లభిస్తుందని ఇక్కడ అధికారులు చెబుతున్నారు.

బ్యాచ్‌ల వారీగా శిక్షణ

ఇక్కడ ఒక్కో రంగానికి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 35 మంది చొప్పున పేషెంట్ రిలేషన్ అసోసియేట్ శిక్షణలో ఇప్పటివరకూ నాలుగు బ్యాచ్‌లకు సంబంధించి 140 మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో 114 మందికి వివిధ ఆస్పత్రుల్లో ఉపాధి కల్పించారు. ప్రస్తుతం 5వ బ్యాచ్ వారు శిక్షణ పొందుతున్నారు. అలాగే సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ 90 రోజుల పాటు ఇస్తున్నారు. ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా ఉంది. శిక్షణ అనంతరం విజయవాడలోని మోహన స్కిల్స్ తిరుపతిలోని లోయల్‌స్కిల్స్ టెక్స్‌టైల్స్ కంపెనీల్లో ఉపాధి కల్పిస్తున్నారు.

చదువుకోలేని వారికి ఆసన్న హస్తం

పెద్దగా ఉన్నత చదువులు లేని వారికి ఈ శిక్షణ చాలా ఉపయోగపడుతున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ వరకూ చదువుకుని ఇంటి వద్ద పరిస్థితులు బాగా లేక ఉండిపోయిన వారికి ఇవి ఉపాధి మార్గం చూపిస్తున్నాయి. ఈ శిక్షణల్లో చేరడానికి 18 ఏళ్లు నిండి పదో తరగతి వరకూ చదువుకున్న మహిళలు అర్హులు కావటం వల్ల చదువు మధ్యలో ఆపేసిన వారు ఎక్కువగా ఈ శిక్షణలో చేరుతున్నారు.

ఉపాధి కోసం..



ఉద్యోగం సంపాదించి ఇంటికి చేదోడుగా ఉండటానికి ఈ శిక్షణలో చేరాను. సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ కుట్టుతో పాటు ఇంగ్లిష్, కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్మీడియెట్ చదువుకున్నాను. పై చదువులు చదవలేక ఖాళీగా ఉన్న సమయంలో జీఆర్‌పీ ద్వారా ఇక్కడ శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని జాయిన్ అయ్యాను.

– శైలజ, సారవకోట మండలం, వెంకటాపురం

మెరుగైన శిక్షణ



ఇక్కడ యువతకు మెరుగైన శిక్షణ అందిస్తున్నాం. కుట్టడం, కత్తిరించడం, ప్రాక్టికల్స్ ఇలా అన్ని విధాలా మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కూడా చూపిస్తున్నాం. విద్యార్థులు కూడా శిక్షణలో మంచి నైపుణ్యతను సాధిస్తున్నారు.

– వై.నాగమణి, సోయింగ్ మిషన్ ఆపరేటర్, ఇన్‌స్ట్రక్టర్

'మాదక ద్రవ్యాల వాడకం అరికడదాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై (నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలు) జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకం, రవాణాను అరికట్టడానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల పరిధిలో డి అడిక్షన్ సెంటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా శాఖ కీలక పాత్ర పోషించి యువత చెడు మార్గాలు పట్టకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ మంది కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో, గుర్తించిన హాట్ స్పాట్ ప్రదేశాల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా ఉండాలని, మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా తదితర ఏ రూపంలో ఉన్న తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం, నిఘా ఉందనే విషయం ప్రతి ఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో ఒడిశా సరిహద్దుగా 112 కిలోమీటర్లు ఉందని 52 రహదారుల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయని ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఇవి కాకుండా నిరంతరం పెట్రోలింగ్ టీమ్‌లు తిరుగుతాయని చెప్పారు. గడిచిన ఆరు నెలల్లో 110 కిలోల గంజాయి అక్రమ రవాణా అడ్డుకుని 14 మందిని వేర్వేరు కేసుల్లో పట్టుకున్నామని చెప్పారు. ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీలు పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వచ్చే వలస కార్మికులు గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించడం, సేవించడం వంటివి జరగకుండా యజమానులు తప్పకుండా తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ట్రమాడాల్ టాబ్లెట్స్ లేదా ఇంజెక్షన్ల వాడకాన్ని డ్రగ్ కంట్రోల్ అధికారులు తరచూ పర్యవేక్షించాలని, వాటి వినియోగంలో వైద్యుల ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. రవాణా వ్యవస్థ పై నిఘా ఉందని, జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్నీ శాఖల సహకారంతో అన్నీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా మాదకద్రవ్యాలను రవాణా చేసినా, కలిగి ఉన్నా, సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, గారు ఆర్.డి.ఓ. సిహెచ్.రంగయ్య, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

నిఘా బృందాలకు దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఎన్నికల విధుల్లో నిఘా బృందాలు పూర్తి పారదర్శకంగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. వివిధ నిఘా బృందాలు, పలు శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి ఆయన మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈసీఐ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని చెప్పారు. తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వాటిపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం నిఘా ఉంచాలని, ఈ మేరకు పూర్తి స్థాయిలో బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగదు జప్తు చేసే సందర్భాల్లో తగు రీతిలో పంచనామా నిర్వహించి తప్పనిసరిగా రశీదులు అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా తగిన ఆధారాలను చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉందనే విషయాన్ని వివరించాలని అన్నారు. త్వరలోనే జిల్లా స్థాయి కమిటీని నియమిస్తామని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ అప్లికేషన్ గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

'ప్రతి కుటుంబానికి పని కల్పించండి'

నందిగాం: మండలంలోని ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించాలనే లక్ష్యంతో ప్రతి క్షేత్ర సహాయకుడు పని చేయాలని డ్వామా పీడీ జి.చిట్టిరాజు అన్నారు. నందిగాంలో ఉపాధిహామీ పథకం 16 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన 1541 పనులకు సంబంధించిన రూ.16,10,91, 215కు సంబంధించి గత పది రోజులుగా మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీ వివరా లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ ఇరిగేషన్ పనులకు సంబంధించిన మెటీరియల్ పనులను 9 మంది డీఆర్‌పీలు పరిశీలించి నివేదికలను సభ దృష్టికి తీసుకువచ్చారు. పీడీ మాట్లాడుతూ నందిగాం మండలంలో 3500 కుటుంబాలకు వంద రోజుల పని తప్పనిసరిగా కల్పించాలని, 75–80 శాతం సగటు పనిదినాలు ఉండేలా అధికారులు చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, ఏపీడీలు మురళీకృష్ణ, లోకేష్, శైలజ, క్వాలిటీ కంట్రోల్ అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన ప్రాంతాల సమస్యలపై చర్చించాం..

• ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



గిరిజన సమస్యలపై చర్చిస్తున్న ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు, ఆ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతీలాల్ దండే

విజయనగరం అర్బన్: రాష్ట్ర పర్యటనలో భాగంగా తన దృష్టికి వచ్చిన వివిధ గిరిజన ప్రాంతాల సమస్యలను ఎస్టీ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతీలాల్ దండే దృష్టికి తీసుకువెళ్లానని ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శనివారం తెలిపారు. ఈ మేరకు విజయవాడలో ఆయనను కలసి, సంబంధిత సమస్యలపై చర్చించామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాల వల్ల గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఏకలవ్య గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ పోస్టులు తొలగిస్తారేమోనన్న ఆందోళనను తెలియజేశానన్నారు. గురుకులాల్లో పదోన్నతులు, రెగ్యులరైజేషన్ వినతులు, బొర్రా, అరకు ప్రాంతాల్లో పర్యాటక రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల విజ్ఞాపనలు తదితర అంశాలపై చర్చించామన్నారు. బొర్రా పంచాయతీకి టూరిజం శాఖ నుంచి వాటా నిధులు రాక పోవడం, ప్రైవేటు సంస్థల ద్వారా అడ్వంచర్ పార్కుల ఏర్పాటుతో పర్యావరణానికి, స్థానిక గిరిజనులకు, వారి హక్కులకు కలుగుతున్న నష్టంపై వారి ఆందోళన, అటవీహక్కుల అంశాలు వంటివి చర్చకు వచ్చాయన్నారు.

49 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి



ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌తో పదోన్నతి పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మొత్తం 49 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పిస్తూ శనివారం ధ్రువపత్రాలు అందజేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్స్)లతో పాటు అదే స్థాయి కేటగిరీ ఉపాధ్యాయులకు ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్)లుగా పదోన్నతి కల్పించినట్లు ఐటీడీఏ పీవో సి.విష్ణు చరణ్ తెలిపారు. కార్యక్రమంలో రుక్మాం దయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు 'సబల' సరస్వతి



సరస్వతి

కొత్తవలస: కెన్యా దేశంలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఆగ్రో ఎకాలజీ లీడర్‌షిప్ అకాడమీ ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు కొత్తవలస మండలానికి చెందిన సబల సంస్థ కార్యదర్శి కె.సరస్వతి ఎంపికైనట్లు ఆహ్వానం అందింది. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ, 25 సంవత్సరాలుగా పర్యావరణ, సుస్థిర అభివృద్ధి, జీవవైవిధ్యంతో కూడిన వ్యవసాయం చేసినందుకు గాను తాను ఎంపికై నట్లు చెప్పింది. భారతదేశం నుంచి ఏడుగురికి ఆహ్వానం అందగా అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి తనకు అవకాశం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడిఉన్న వస్తువులు

శృంగవరపుకోట: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి రేపాక సన్యాసి శెట్టి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. చెన్నైలో ఉంటున్న కొడుకు, కోడలిని చూసేందుకు సన్యాసి శెట్టి శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అదే ఇంట్లోకి దొంగలు చొరబడి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ దోచుకుపోయారు. ఈ ఘటనపై సీఐ మురళి మాట్లాడుతూ బాధితుడి నుంచి సమాచారం వచ్చిందని, పలు వస్తువులు పోయాయని ఆయన తమకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారని, అయితే కొన్ని వస్తువులు ఉన్నట్లు గుర్తించామన్నారు. బాధితుడు ఇక్కడికి వచ్చి, ఏయే వస్తువులు పోయాయో చెప్పేంతవరకు తాము ఏ వస్తువులు, ఎంత మేర దోచుకువెళ్లారన్న విషయ నిర్ధారించలేమన్నారు. ఎవరైనా ఊరు వెళ్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అలా అయితే ఆ ప్రాంతంలో నిఘా ఉంచుతామన్నారు.

గిరిపుత్రులకు ఉపాధి భరోసా

• జిల్లాలో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం
• 50 సెంట్ల చొప్పున నిర్మాణాలకు కేటాయింపు
• రూ.4.65 కోట్ల నిధులతో ఒక్కో నిర్మాణం
• ప్రతీ యూనిట్ పరిధిలో 200 మందికి ఉపాధి అవకాశాలు
• చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీతో గిరిజనులకు ఆర్థిక ఊతం
• నేటినుంచి నిర్మాణ పనులు ప్రారంభం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న కార్యక్రమానికి హాజరైన ఉన్నతాధికారులు



అట్టలిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

పార్వతీపురంటౌన్: గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడంతో వారికి ఎలాగైనా ఆర్థిక భరోసానివ్వాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల(చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ యూనిట్లు) నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లాలో రెండు చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆయా నిర్మాణాలకు పార్వతీపురం మండలంలోని చందలంగి, పాలకొండ మండలంలోని అట్టలి గ్రామంలో 50 సెంట్ల చొప్పున భూమి కేటాయించారు. ఒక్కో యూనిట్‌ను రూ.4.65 కోట్లతో నిర్మిస్తుండగా, మొత్తం రూ.9.30 కోట్ల నిధులతో యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ఈ నెల 18వ తేదీ నుంచే ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం ప్రారంభం కానుంది.

రైతులకు లాభం చేకూరేలా..

నెల్లూరుకు చెందిన అజయ్ బాబు ఇండస్ట్రీస్ వారు ఈ మిల్లెట్స్ యూనిట్లను నెలకొల్పనున్నారు. రైతులందరికీ మంచి లాభాలు వచ్చేలా చిరుధాన్యాలను ఈ యూనిట్లు కొనుగోలు చేస్తాయి. మిల్లెట్ పౌడర్, మిల్లెట్ మాల్ట్, మిల్లెట్ ముద్దలు, మిల్లెట్ బిస్కెట్లు, మిల్లెట్ జావా, మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ దోసలు వేసే పౌడర్ తదితర పదార్థాల తయారీకి అనువైనవి ఇక్కడ తయారు చేస్తారు.

జిల్లాలో చిరుధాన్యాల సాగు ఇలా..

సాలూరు మండలంలో అత్యధికంగా 2,092 ఎకరాల్లో, పాచిపెంట మండలంలో 1358 ఎకరాల్లో, గుమ్మలక్ష్మీపురం మండలంలో 369 ఎకరాల్లో, కురుపాం మండలంలో 50 ఎకరాల్లో, కొమరాడ మండలంలో 273 ఎకరాల్లో, పార్వతీపురం మండలంలో 44 ఎకరాల్లో, సీతంపేట మండలంలో 83 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా చిరుధాన్యాలు సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను రైతులకు అందజేస్తూ, చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఏడాదిన్నర లోపే అందుబాటులోకి..

ఈ యూనిట్లను ఏడాదిన్నర లోపే అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కో యూనిట్‌లో పనిచేసేందుకు 200 మంది చొప్పున మొత్తం 400 మందికి నేరుగా ఉపాధి అవకాశం కలుగుతుంది. స్థానికులకే వీటిల్లో ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వం చట్టం కూడా చేసింది. ఇప్పటికే యూనిట్ల నిర్మాణ పనులపై జిల్లా అధికార యంత్రాంగం, ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది.

జిల్లాలో చిరుధాన్యాల సాగు ఇలా..

పంట	సాగు విస్తీర్ణం	పండిస్తున్న రైతులు
చోడి	3116	2713
కొర్రలు	375	391
సామలు	551	371
జొన్నలు	241	113
గంటెలు	86	52
మొత్తం	4,269	3,640

మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు..



మా గ్రామానికి ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. గిరిజన, వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పాలకొండ సమీపంలోని అట్టలి గ్రామంలో ఈ తరహా ప్రాజెక్టు ఏర్పాటు కానుండడంతో ఉపాధి అవకాశాలు మెరుగుకానున్నాయి. గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తుండడం శుభపరిణామం.

– కె.సంధ్యారాణి, సర్పంచ్, అట్టలి.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి..



వ్యవసాయాధారిత జిల్లా అయిన పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతం అధికంగా ఉండడంతో ఇక్కడి గిరిజనులంతా చిరుధాన్యాల సాగుపై ఆసక్తి ఎక్కువగా కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరికి ఇక్కడ నెలకొల్పే ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా అధిక ప్రయోజనం చేకూరనుంది. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు లాభాలు వచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని భావిస్తున్నా.

– వై.సత్యంనాయుడు, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా.

ఎన్నికల పనులు పూర్తిచేయండి

• కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన లోపలే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికల శిక్షణ, నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలకే సమయం సరిపోతుందన్నారు. ఎన్నికల సన్నద్ధతపై నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ స్టేషన్ల మార్పు, భవనాల మార్పులు ఏమైనా ఉంటే ఈ నెలాఖరులోగా ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎన్నికలకు అవసరమైన మేన్‌పవర్, వాహనాల అవసరత, పోలింగ్ స్టేషన్లలో ఇంటర్నెట్ కనెక్షన్ తదితర అవసరాలను రిటర్నింగ్ అధికారులు ముందుగానే చూసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో కనీస అవసరాలను తనిఖీ చేయాలని, లేదంటే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ కనెక్షన్, లైట్లు, ఫ్యాన్‌లు, రాంపులు, తాగునీరు, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లు అన్నీ గ్రౌండ్ ఫ్లోర్‌లోనే తప్పక ఉండేలా చూడాలన్నారు. ఆర్‌ఓలు చెక్ లిస్టు పెట్టుకొని అవసరమగు ఏర్పాట్లన్నింటినీ ముందే చూసుకోవాలన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా సవరణ కోసం వచ్చిన ఫారాల డిస్పోజల్ 6, 8పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంకను డిస్పోజ్ చేయవలసిన ఫారాలు 2 వేలు వరకు ఉన్నాయని, దరఖాస్తు అందిన వారం లోగానే డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, 7 నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎస్‌ఐసీ అధికారులు, ఎన్నికల డీటీలు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆంధ్రా-కేరళ క్రికెట్ మ్యాచ్

విజయనగరం: డెంకాడ మండలంలోని చింతలవలస దగ్గరున్న డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలోని మైదానంలో ఆంధ్రా-కేరళ జట్ల మధ్య జరుగుతున్న రంజీ క్రికెట్ మ్యాచ్ హోరాహోరీగా కొనసాగుతోంది. మ్యాచ్ రెండో రోజు అయిన శనివారం ఆంధ్రా జట్టు 89.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 260 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ వద్ద మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను తిరిగి ప్రారంభించి, 96.4 ఓవర్లలో 272 పరుగుల వద్ద ఆలౌటైంది. మహీప్‌కుమార్ 81 పరుగులు, కెప్టెన్ రిక్కీ బుయ్ 87 పరుగులు, కరణ్ షిండే 43 పరుగులతో రాణించారు. కేరళ బౌలర్లలో బిశాల్ తంపి 4 వికెట్లు తీశాడు. మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన కేరళ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టపోయి 258 పరుగులు చేసింది. రోషన్ 61 పరుగులు, కృష్ణప్రసాద్ 43 పరుగులతో రాణించగా, కెప్టెన్ సచిన్‌బేబి 87 పరుగులు, అక్షయ్‌చంద్ర 57 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఆంధ్రా బౌలర్లలో పి.వి.ఎస్.ఎన్.రాజు, జి.మనీష్, షోయబ్ మహ్మద్ ఖాన్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

మార్చి 3 నుంచి బాలల సినీ ఉత్సవం

• బాలల సినీ ఉత్సవం కమిటీ ఛైర్మన్ నారాయణం శ్రీనివాస్



మీడియాతో మాట్లాడుతున్న నారాయణం శ్రీనివాస్

విజయనగరం రూరల్: నగరంలో మార్చి 3వ తేదీ నుంచి బాలల సినీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు బాలల సినీ ఉత్సవం కమిటీ ఛైర్మన్, ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎన్‌సీఎస్ ఐనాక్స్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 15వ తేదీ వరకు కామెడీస్ ఆఫ్ చార్లీచాప్లిన్ అనే పేరుతో ఈ ఉత్సవం నిర్వహించనున్నామన్నారు. రోటరీ క్లబ్ ఫోర్ట్, విజయనగరం ఫిలిం సొసైటీ, ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నాయన్నారు. ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా మండా రవి, కో-ఛైర్మన్లుగా నారాయణం నిత్య, దవళ వెంకటరావులు వ్యవహరించనున్నారన్నారు. అనంతరం ఉత్సవ ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామం వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.కోటకు చెందిన రాంబాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు విజయనగరం నుంచి శృంగవరపుకోటకు రాంబాబు తన బైక్‌పై వస్తుండగా సరిగ్గా సీతారాంపురం మలుపు వద్ద అతడి వాహనం అదుపు తప్పి, పడిపోయింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించి, వైద్యసేవలు అందించారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న సైబర్ సెల్ సీఐ విజయకుమార్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పలువురు పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను స్థానిక సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విజయనగరం సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఫోన్లు పోయినట్లు బాధితులు చేసిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి, ట్రేస్ చేయగా 30 ఫోన్లు గుర్తించి, పట్టుకున్నామన్నారు. ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే ఫోన్లు పట్టుకుని, ఇవ్వడంతో బాధితులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత్‌కుమార్, నజీమా బేగం, కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తానని ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రెడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. శంకర్‌రెడ్డిని ఆలిండియా రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు మారం బాలబ్రహ్మారెడ్డి, ఏపీ స్టేట్ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, గుడ్ల బ్రహ్మానందరెడ్డి, రెడ్డి జేఏసీ యూత్ సెక్రటరీ బోర చంద్రశేఖరరెడ్డి, తదితరులు శనివారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా రెండోసారి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి రుణపడి ఉంటానన్నారు.

వితరణ



భోగాపురం:హెచ్ఎం శ్రీనివాసరావుకు సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కొమ్మూరు జగన్ మోహనరావు, అల్ల శేఖర్ పది సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీఏజీ హెచ్ఎఫ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. గతంలో కూడా కొంతమంది పూర్వ విద్యార్థులు రూ.80 వేల విలువ చేసే ఐరన్ గేట్లను వితరణగా అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు, పీడీలు చిన్నారి, బి.రఘు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: బూట్లు, సాక్సులు అందుకున్న విద్యార్థులతో యువమంచ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు బూట్లు..

డెంకాడ: విజయనగరానికి చెందిన మార్వాడీ యువ మంచ్ సభ్యులు మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్కౌట్ విద్యార్థులకు బూట్లు, సాక్సులు వితరణగా అందజేశారు. యువమంచ్ అధ్యక్షులు మణిశర్మ, సంజీవ్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రవిశంకర్, పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీరాములునాయుడు, స్కౌట్ ఉపాధ్యాయులు ఎ. శాంతిస్వరూప్, జె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఫోర్ట్ సిటీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాఠశాల వార్షికోత్సవాలను పాఠశాల ఛైర్మన్ కేవీపీ రాజు (శివ) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆఫ్రికా, మెక్సికో, స్పెయిన్, అమెరికా, జపాన్, కొరియా, బ్రెజిల్, అఫ్ఘనిస్తాన్, తదితర విదేశాల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్‌ఛైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు దుర్ఘటనల్లో నలుగురి మృతి

జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. అప్పులబాధ తాళలేక ఒకరు, గుండెపోటుతో మరొకరు, రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించగా, బాధిత గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి..

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



బొండపల్లి: బంగారప్పడును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

బొండపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని మండల కేంద్రానికి చెందిన కోల్లి బంగారప్పడు(54) మృతి చెందాడు. ఈ దుర్ఘటన మండల కేంద్రం పరిధిలోని 26వ నంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బొండపల్లి మండల కేంద్రంలోని యాతపేటకు చెందిన బంగారప్పడు వృత్తిరీత్యా కల్లుగీత కార్మికుడు కాగా ఎప్పటిలాగే కల్లు గీసేందుకు రహదారి మీదుగా వెళ్తుండగా, గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై, అక్కడికక్కడే స్పృహ కోల్పోయి పడిపోయాడు. స్థానికుల సహాయంతో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి అతడిని తరలించి, వైద్యసేవలు అందించగా, అక్కడే చికిత్స పొందుతూ మరణించారు. మృతుడికి భార్య పైడమ్మ, కొడుకు శ్రీను ఉన్నారు. ఈ దుర్ఘటనకు కారణమైన వారిని వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం నాయకులు అప్పారావు పోలీసులను కోరారు.

అప్పుల బాధ తాళలేక..



బొబ్బిలి: మహేష్(ఫైల్)

బొబ్బిలి: అప్పుల బాధ తాళలేక బొండాడ మహేష్(34) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మండలంలోని దిబ్బగుడివలస గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఉపాధి రీత్యా కుటుంబంతో సహా విశాఖపట్నానికి వెళ్లిన మహేష్ అక్కడ ఓ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తూనే అక్కడి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వారి బట్టలు ఇస్త్రీ చేస్తూ ఉండేవాడు. ఆ వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే ఊరిలో కొత్త ఇంటి నిర్మాణానికి మహేష్ కొంత డబ్బు అప్పు చేశాడు. కొంత బంగారాన్ని బ్యాంకులో పద్దు పెట్టాడు. అప్పు తీర్చాలని బ్యాంకు నుంచి ఇటీవల నోటీసులు రావడంతో అప్పు తీర్చలేక.. మనస్తాపానికి గురై, ఇంట్లోనే ఉరివేసుకుని చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి మృతదేహం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డొస్తున్న వారిని తప్పించబోయి..



గజపతినగరం రూరల్: రమణ(ఫైల్)

గజపతినగరం రూరల్: మండలంలోని కొనిశ గ్రామ కూడలి వద్ద బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో చనపతి రమణ(23) అనే యువకుడు దుర్మరణం చెందాడు. మండలంలోని పురిటిపెంట గ్రామానికి చెందిన ఇతడు శనివారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై కొనిశ గ్రామం వెళ్లి, వస్తుండగా అడ్డుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులను తప్పించబోయి అతడి బైక్ అదుపుతప్పి, ఎదురుగా ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని వైద్యసేవల నిమిత్తం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి మృతదేహం తరలించారు. బాధిత బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

గుండెపోటుతో విద్యార్థి..



మక్కువ: అశోక్(ఫైల్)

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గ్రామ ఆశ్రమ పాఠశాల విద్యార్థి సీదరపు అశోక్(15) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. ప్రిన్సిపాల్ పుష్పనాథం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సాలూరు మండలంలోని కారాడవలస గ్రామానికి చెందిన అశోక్ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అతడికి ఒంట్లో బాగాలేకపోవడంతో శంబర పీహెచ్‌సీకి సిబ్బంది తీసుకువెళ్లారు. అక్కడ జరిపిన పరీక్షల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండడంతో పాటు బీపీ కూడా తక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించి, అవసరమైన మందులు ఇచ్చి, పంపించారు. సదరు విద్యార్థి సాయంత్రం వాలీబాల్ కూడా ఆడాడని, రాత్రి భోజనం చేసిన తర్వాత ఆయాసం రావడంతో మళ్లీ 108 అంబులెన్స్‌లో పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతుండగా శనివారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై, చనిపోయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కుమారుడి మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమయ్య, రాములమ్మలు కన్నీరుమున్నీరై విలపించారు. విద్యార్థి మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు హరికృష్ణ డిమాండ్ చేశారు. డీఈవో స్పందించి, విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరా తీయాలన్నారు.

మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



పోలీసులు, న్యాయవాదులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ ను విజయవంతం చేయాలని ఆ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకునేందుకు వీలున్న సివిల్,క్రిమినల్,తదితర కేసులను పరిష్కరిస్తామని చెప్పారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషిచేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీపడడానికి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదిక అన్నారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పందెం



పరుగు తీస్తున్న గుర్రాలు

వేపాడ: మండలంలోని జాకేరులో వీరాంజనేయ, చిన్నమ్మ, పైడమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా శనివారం నిర్వహించిన గుర్రాల పరుగు పందాలు అలరించాయి. సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, అప్పలనాయుడు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో డీసీసీబీ ఛైర్మన్ చినరామునాయుడు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. ఈ పోటీలో 13 గుర్రాలు పాల్గొనగా.. రామన్నపాలెంనకు చెందిన చోడమాంబ విక్రమ్ గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కొట్యాడకు చెందిన సింగపూర్ సత్యనారాయణ ఠాగూర్ గుర్రం రెండో స్థానంలో, హనుమంతురావు గుర్రం మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.